నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, శనివారం 3 ఆగస్టు 2024 | VIKARABAD

173 మంది బాలకార్మికులకు విముక్తి

ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఆగస్టు 2 : జిల్లాలో పదో విడుత ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా 173 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించినట్లు జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లాలో సబ్ డివిజన్లవారీగా మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జూలై 1 నుంచి 31 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. 151 మంది బాలలు, 22 మంది బాలికలకు పని నుంచి విముక్తి కల్పించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చామని తెలిపారు. ఇందులో 31 మంది ఇతర రాష్ట్రాలకు చెందినవారున్నారని తెలిపారు. పిల్లలను పనిలో పెట్టుకున్న వారిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎవరైనా బాలబాలికలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100 కి ఫోన్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతానికి కృషి చేసిన ప్రత్యేక బృందాలను అభినందించారు.

లెక్క తప్పింది.. వడ్డీ భారమైంది

- రుణమాఫీకి కొర్రీలు పెడుతున్న బ్యాంకర్లు
- మిత్తి చెల్లిస్తేనే అసలు మాఫీ అంటూ వెల్లడి..
- కటాఫ్ తేదీ తరువాత కాలానికీ వడ్డీ చెల్లించాలని ఒత్తిడి
- తప్పని పరిస్థితుల్లో అధిక వడ్డీకి అప్పులు తెచ్చి కడుతున్న రైతులు

వికారాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీతో జిల్లా రైతాంగానికి కొత్త కష్టాలు మొదలయ్యాయి. ఓ వైపు ప్రభుత్వం విధించిన నిబంధనలతో సుమారు లక్ష మంది రైతులు నష్టపోగా, మరోవైపు బ్యాంకర్లు పెట్టే కొర్రీలతో అప్పుల పాలవుతున్నారు. ప్రభుత్వం రూ.లక్షన్నర వరకు ఉన్న పంట రుణాలను మాఫీ చేశామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నది. డిసెంబర్ 9, 2023 లోపు ఉన్న పంట రుణాలకు సంబంధించి అసలుతోపాటు మిత్తిని మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే వాస్తవానికి మాత్రం మిత్తి చెల్లిస్తేనే రుణమాఫీ అవుతుందని బ్యాంకర్లు రైతుల నుంచి ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. రుణమాఫీ పూర్తయ్యిందని సంబురపడి బ్యాంకులకు వెళ్తున్న రైతులకు మిత్తి చెల్లిస్తేనే రుణమాఫీ పూర్తవుతుందని బ్యాంకర్లు చెబుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని బ్యాంకులు కటాఫ్ తేదీ అనంతరం ఇప్పటి వరకు అయిన వడ్డీని వసూలు చేస్తుండగా.. మరికొన్ని బ్యాంకులు కేవలం అసలు రుణాలకు సంబంధించిన జాబితానే ప్రభుత్వం పంపించిందని, మిత్తి డబ్బులు చెల్లిస్తేనే రుణమాఫీ ప్రక్రియ పూర్తవుతుందని ఒత్తిడి తెస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. ఏటా రైతులు తమ పంట రుణాలను రెన్యువల్ చేస్తూ వాటి రసీదులు పొందినప్పటికీ పంట రుణాలను రెన్యువల్ చేసుకోలేదంటూ రుణమాఫీ జాబితా నుంచి పేర్లను తొలగించినట్లు పలువురు వాపోతున్నారు. అయితే ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలను తీసుకురాకపోవడంతోపాటు బ్యాంకర్లు చేసిన తప్పిదాలతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు.

బ్యాంకర్ల తప్పిదం.. రైతులకు శాపం..

కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షలలోపు పంట రుణాలకు సంబంధించి అసలుతోపాటు వడ్డీని కూడా మాఫీ చేస్తున్నామని చెబుతున్నప్పటికీ.. జిల్లాలోని పలు బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాల్లో కేవలం అసలు మాత్రమే మాఫీ అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఇదీగాక జిల్లాలోని కెనరా బ్యాంకుతోపాటు మరో రెండు బ్యాంకర్లు చేసిన తప్పిదం అన్నదాతల పాలిట శాపంగా మారింది. సదరు బ్యాంకర్లు రుణ జాబితాను వడ్డీతోకలిపి కాకుండా అసలు మాత్రమే ప్రభుత్వానికి పంపడంతో.. ప్రస్తుతం రైతులు వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతేకాకుండా వడ్డీ డబ్బులు చెల్లిస్తేనే రుణమాఫీ అవుతుందని ఆ బ్యాంకర్లు తెగేసి చెబుతుండడంతో తప్పని పరిస్థితుల్లో అప్పులు చేసి వడ్డీ చెల్లిస్తున్నారు. ఓ వైపు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకొని రుణమాఫీ చేపట్టడంతో అర్హులైన సుమారు లక్ష మంది రైతులు నష్టపోగా, మరోవైపు రుణమాఫీ అయిన రైతులను వడ్డీ డబ్బులు చెల్లించాలని స్పష్టం చేస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఏడు నెలల వడ్డీ చెల్లిస్తేనే రెన్యువల్...

డిసెంబర్ 9, 2023 లోపు ఉన్న పంట రుణాలకు సంబంధించి అసలుతోపాటు మిత్తిని మాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ కటాఫ్ తేదీ అనంతరం అయిన వడ్డీ డబ్బులు చెల్లించాలని రైతులపై బ్యాంకర్లు ఒత్తిడి తెస్తున్నారు. కటాఫ్ తేదీ అనంతరం ఈ ఏడు నెలలకు సంబంధించి వడ్డీ డబ్బులను చెల్లిస్తేనే రుణమాఫీ పూర్తి చేయడంతోపాటు రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేస్తామంటున్నారు. ఇప్పటికే పంట పెట్టుబడికి అప్పులు చేసిన రైతులు, ఇప్పుడు వడ్డీ డబ్బులు చెల్లించేందుకు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. రైతు భరోసా ఇవ్వకుండా, అసలుతో కలిపి మిత్తిని మాఫీ చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుల పాలు చేస్తున్నదని అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అసలు, మిత్తిని మాఫీ చేయడంతోపాటు కటాఫ్ తేదీ అనంతరం కాలానికి వడ్డీని వసూలు చేయకుండా బ్యాంకర్లకు ఆదేశాలు జారీ చేయాలని జిల్లా రైతాంగం ప్రభుత్వాన్ని కోరుతున్నది. మరోవైపు రూ.2 లక్షలపైన ఉన్న రుణాలను ఆగస్టు 15లోపు చెల్లించాలని రైతులకు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఒకవేళ నిర్ణీత గడువులోగా రూ.2 లక్షలకు పైన ఉన్న రుణాలను చెల్లించకపోతే రుణమాఫీ వర్తించదని సంబంధిత అధికారులు స్పష్టం చేస్తున్నట్లు రైతులు వాపోతున్నారు. ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షలలోపు రుణాలను మాఫీ చేస్తామని హామీనిచ్చి, ఇప్పుడు రుణమాఫీకి మెలికలు పెట్టడంపై జిల్లా రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

40వేల వరకు వడ్డీ వసూలు చేస్తుండ్రు..

గత సంవత్సరం పట్టా పాస్ బుక్‌లు తనఖా పెట్టి బ్యాంకులో లక్ష రూపాయల రుణం తీసుకున్నాను. ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో పాస్ పుస్తకాన్ని తీసుకునేందుకు బ్యాంకుకు వెళ్లగా.. బ్యాంకు అధికారులు వడ్డీ చెల్లించాలని చెబుతున్నారు. ప్రతి రైతు వద్ద రూ.20వేల నుంచి 40 వేల వరకు వడ్డీని వసూలు చేస్తున్నారు.

-మహితాబ్ అలీ, మద్గుల్ చిట్టంపల్లి, వికారాబాద్

హామీ బారెడు మాఫీ మూరెడు

రూ.5, రూ.10 మాఫీ చేసినట్లు రైతుల పేర్లు జాబితాలో నమోదు

కారణాలపై స్పష్టత ఇవ్వలేకపోతున్న అధికారులు

ఎక్కువ మందికి రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పేందుకేనా!

సొసైటీల్లో లక్షన్నర రుణం తీసుకున్న వారికి సైతం ప్రభుత్వం మొండి చెయ్యి

- చేవెళ్ల మండలం చనువెల్లి గ్రామానికి చెందిన ఓ రైతుకు ఒక్క రూపాయి మాఫీ అయినట్లు లక్షన్నర రుణమాఫీ జాబితాలో వచ్చింది. తనకు మొదటి విడుతలోనే రూ.లక్ష రుణం మాఫీ కాగా... రెండో విడుతలో ఒక్క రూపాయి మాఫీ అయినట్లు రావడంతో వాపోవడం రైతు వంతైంది.

-చేవెళ్ల మండలం ఊరెళ్ల గ్రామానికి చెందిన మరో రైతుకు రూ.5 మాఫీ అయినట్లు లక్షన్నర రుణమాఫీ జాబితాలో పేరు వచ్చింది. రెండేండ్ల క్రితం తీసుకున్న రుణాన్ని మొత్తం తీర్చడంతో బ్యాంకులో అప్పే లేదని.. ఈ 5 రూపాయల మాఫీ విషయం తమకు తెలియదని సదరు రైతు కుటుంబం చెబుతున్నది.

రంగారెడ్డి, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ) : ఇలా చెప్పుకొంటూ పోతే రంగారెడ్డి జిల్లా రుణమాఫీ జాబితాలో చిత్రవిచిత్రాలు ఎన్నో చోటుచేసుకున్నాయి. కొంతమంది రైతులకు పది రూపాయిలు మాఫీ అయితే.. మరికొందరికి రూ.వందల్లో మాఫీ అయింది. దీంతో రుణమాఫీ ప్రక్రియ ప్రహసనంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అస్తవ్యస్త జాబితాపై అటు బ్యాంకర్లు, ఇటు వ్యవసాయ అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. మొదటి విడుతలో జిల్లాలో 49,700 మందికి రూ.258.18కోట్లు, రెండో విడుతలో 22,915 మంది రైతులకు రూ.218.12 కోట్లు మాఫీ చేసినట్లు ప్రభుత్వం చెబుతున్నది. ప్రభుత్వం విధించిన ఆంక్షల నేపథ్యంలో అర్హులైన రైతులెందరో మాఫీకి దూరం కాగా.. జాబితాలో పేరు ఉన్నా కొంతమంది రైతుల ఖాతాల్లోనూ మాఫీ డబ్బులు జమ కాలేదు. దీనికితోడు జాబితాలో ఐదు రూపాయలు, పది రూపాయలు సైతం మాఫీ అయినట్లు ఉండడంతో ఇదేమి రుణమాఫీ.. అంటూ రైతులు పెదవి విరుస్తున్నారు. ఎక్కువ మందికి రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకోవడానికేనా! అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అంకెల గారడిని చూసి అసలు ఏ ప్రాతిపదికన జాబితాను రూపొందించారన్న సందేహాలను రైతాంగం వ్యక్తం చేస్తున్నది.

సొసైటీలకు రెండో విడుతలోనూ మొండి చెయ్యి..

రంగారెడ్డి జిల్లా డీసీసీబీ పరిధిలో రూ.లక్ష లోపు రుణం తీసుకున్న రైతులు సుమారు 34వేల మంది వరకు ఉన్నారు. అయితే ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో కేవలం 11,700 మంది రైతుల పేర్లు మాత్రమే వచ్చాయి. రెండో విడుతలో లక్షన్నర రుణమాఫీ కేవలం 5,380 మందికి మాత్రమే అయింది. కానీ.. మాఫీకి అర్హత ఉన్నవారు ఇంతకంటే ఎక్కువే ఉన్నట్లు తెలుస్తున్నది. రంగారెడ్డి జిల్లాలోని చాలావరకు సొసైటీల్లో మొదటి, రెండో విడుతల్లో వేల సంఖ్యలో రైతులు రుణమాఫీకి దూరమయ్యారు.

షాద్‌నగర్ నియోజకవర్గంలోని మేకగూడ పీఏసీఎస్‌లో రూ.లక్షలోపు రుణమాఫీ 306 మందికిగాను 181 మందికే అయింది. లక్షన్నర రుణమాఫీకి 45 మంది అర్హత కలిగి ఉండగా.. 21 మందికే మాఫీ అయింది. చేగూరు పీఏసీఎస్‌లో రూ.లక్షలోపు రుణమాఫీకి 264 మంది అర్హులుకాగా.. 156 మందికే మాఫీ అయింది. రెండో విడుతలో 55 మంది రైతులకుగాను 30 మంది రైతులే రుణవిముక్తులయ్యారు.

నందిగామ పీఏసీఎస్‌లో రూ.లక్షలోపు రుణాలు తీసుకున్నవారు 34 మంది ఉండగా.. కేవలం 12 మందికే రుణమాఫీ జరిగింది. లక్షన్నర రుణమాఫీలో ఏడుగురు రైతులకుగాను ఒక్కరికే మాఫీ చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే పరిమితం

కాంగ్రెస్ ప్రభుత్వం మాటలకే పరిమితమైంది. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఎన్నో హామీలిచ్చి.. తీరా అధికారంలోకి వచ్చాక ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదు. అధికారంలోకి రాగానే ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి.. 8 నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో మాఫీ చేపట్టడం లేదు. కొద్దిమంది రైతులకు మాత్రమే రుణమాఫీ చేసి గొప్పలు చెప్పుకుంటున్నది. నాకు రూ.40,000 లోపే క్రాప్ లోన్ ఉన్నది. అయినా మాఫీ కాలేదు. అధికారులను అడిగినా సరైన సమాధానం ఇవ్వడంలేదు.

-మెకం రాజు, రైతు, మేకగూడ

రెండో విడుతలోనూ మాఫీ కాలేదు..

నా పేరు మీద రెండు ఎకరాల 15 గుంటల భూమి ఉండగా.. చేవెళ్లలోని కో-ఆపరేటివ్ బ్యాంకులో రూ.96,770 క్రాప్ లోను తీసుకున్నా. మొదటి విడుతలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన లక్షలోపు రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. రెండో విడుతలో మాఫీ అవుతదనుకుంటే చివరకు నిరాశే మిగిలింది. ఇప్పుడు కూడా రుణమాఫీ కాకపోవడంతో అధికారులను అడిగితే నీకు రేషన్ కార్డు లేదు.. అందుకే కాలేదేమో అని చెబుతున్నారు. సీఎం కేసీఆర్ ఉన్నప్పుడు అర్హులందరికీ అందాయి. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం లేనిపోని సాకులు చూపుతూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నది.

-పెంజర్ల అనంతరెడ్డి , చేవెళ్ల గ్రామం, రంగారెడ్డి జిల్లా

అర్హత ఉన్నా.. రుణమాఫీ కాలేదు ..

యాచారంలోని పీఏసీఎస్ లో రూ.61000 పంట రుణం తీసుకున్నా. అయినా ప్రభుత్వం అమలు చేసిన రుణమాఫీ జాబితాలో నా పేరు రాలేదు. నాలాంటి అర్హత కలిగిన ఎంతో మంది రైతులు రుణమాఫీ కాక బ్యాంకుల చుట్టూ, రైతు వేదికల చుట్టూ తిరుగుతున్నారు. మొదటి, రెండో విడుతల్లో రుణమాఫీ కానీ రైతులు మూడో విడుత కోసం ఎదురుచూస్తున్నారు. మూడో విడుతలోనైనా ఇప్పటివరకు రుణమాఫీ కానీ రైతులందరికీ రుణమాఫీ చేసి న్యాయం చేయాలి. లేదంటే రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై రానున్న రోజుల్లో రైతులు తిరగబడటం ఖాయం.

- కోలన్ కల్పన, మల్కిజ్‌గూడ, యాచారం మండలం

5 నుంచి స్వచ్ఛదనం - పచ్చదనం

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఆగస్టు 2(నమస్తే తెలంగాణ): జిల్లాలో ఈ నెల 5 నుంచి 9 వరకు నిర్వహించనున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రంగారెడ్డి కలెక్టర్ శశాంక అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరం నుంచి ఆయన అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా స్థాయి అధికారులతో కలిసి స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమ నిర్వహణపై మండలాల స్పెషల్ ఆఫీసర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, ఏపీఎంలు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం మెరుగుపర్చడం, గ్రీనరీని పెంచడమే లక్ష్యంగా జిల్లాలోని గ్రామాలు, పట్టణ ప్రాంతాలలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఆగస్టు 5న గ్రామాలు, పట్టణ వార్డుల్లో ఈ కార్యక్రమాన్ని పౌరులతో కలిసి ప్రారంభించాలని సూచించారు. ఆగస్టు 6న తాగునీరు, వర్షపు నీటి సంరక్షణ, ఆగస్టు 7న కాలువలు, నీరు నిలిచిన ప్రాంతాలు, గుంతలను పూడ్చడం వంటి కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ఆగస్టు 8న ఆరోగ్యం, వీధి కుక్కల బెడదపై దృష్టి పెట్టాలని, ఆగస్టు 9న ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వ స్థలాలను శుభ్రపర్చడం వంటి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, ప్రకృతి వనాలు, పల్లె ప్రకృతి వనాల్లో చనిపోయిన మొక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ప్రతి రోజూ ట్యాంకులను శుభ్రపర్చి క్లోరినేషన్ చేసి వ్యాధులు ప్రబలకుండా స్వచ్ఛమైన తాగునీటిని అందజేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అందరు అధికారులు భాగస్వాములు కావాలన్నారు. గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, కార్యదర్శి, ఆశా కార్యకర్త, వీవోలతో కమిటీని ఏర్పాటు చేసుకుని నిర్దేశిత కార్యక్రమాలు పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ ఆఫీసర్లు వారికి సబంధించిన మండలాలు, నియోజకవర్గల్లో వారి పరిధిలో ఉన్న ప్రభుత్వ హాస్టళ్లను ఆకస్మికంగా సందర్శించి పరిశుభ్రత, తాగునీటి వసతి, వంట శాలలను పరిశీలించలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో కృష్ణా రెడ్డి, డీఆర్డీవో శ్రీలత, డీపీవో సురేశ్‌మోహన్, వైద్యాధికారి వెంకటేశ్వర్ రావు, ఎస్సీ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై దృష్టిసారించాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, ఆగస్టు 2 : ప్రజల జీవనోపాధిని మెరుగుపర్చేందుకు అధికారులు కృషి చేయాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శుక్రవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో చేపట్టాల్సిన పనులపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఆగస్టు 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాలన్నారు. ఐదు రోజుల పాటు రోజువారీగా చేపట్టాల్సిన పనులపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాలతో సమావేశాలు నిర్వహించి వారిని భాగస్వాములను చేయాలన్నారు. ఇందులో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, వసతి గృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్ స్టాప్‌లో పారిశుధ్య పనులను చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తాగునీటిని సరఫరా చేయాలన్నారు. గ్రామాల రహదారులకు స్వాగతం, ధన్యవాదాలు సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మురుగు కాలువలు, నీరు నిలిచిన ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. స్వచ్ఛదనం-పచ్చదనంపై విద్యార్థులకు వ్యాస రచన, పద్య గేయాలలో పోటీలు నిర్వహించి మొదటి బహుమతి, రెండో బహుమతుల కింద నగదు పారితోషికం ఇవ్వనున్నట్లు తెలిపారు. గోడలపై పెయింటింగ్ పనులు చేపట్టాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటేందుకు ప్రతి ఇంటికీ 6 మొక్కల చొప్పున అందించాలన్నారు. విద్యుత్తు సమస్యలను పరిష్కరించడంతో పాటు ఒరిగిన స్తంభాలు, వేలాడుతున్న వైర్లను సరి చేయాలని విద్యుత్తు అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి , డీఆర్డీవో శ్రీనివాస్ , డీపీవో జయసుధ, డీఎంహెచ్‌వో పల్వన్ కుమార్, డీఈవో రేణుకాదేవి, పంచాయతీ రాజ్ ఈఈ ఉమేశ్, పశుసంవర్ధక శాఖ అధికారి పూర్ణ చంద్రరావు, మెప్మా పీడీ రవికుమార్, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సప్తముఖ మహాగణపతి

70 ఏండ్ల ప్రస్థానం.. 70 అడుగుల ఎత్తులో మట్టి విగ్రహ ప్రతిష్ఠాపన

ఖైరతాబాద్, ఆగస్టు 2 : ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఆ సమయం రానే వచ్చింది. కోట్లాది మంది భక్తులకు కొంగుబంగారంగా నిలిచి ప్రతి ఏడాది భిన్నమైన రూపాలతో కనిపించే ఖైరతాబాద్ మహాగణపతి ఈ ఏడాది శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిగా దర్శనమివ్వనున్నారు. ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ కమిటీ ప్రస్థానంలో 1954 సంవత్సరంలో ఒక్క అడుగుతో మొదలై.. నేడు 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా 70 అడుగుల ఎత్తులో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిస్తున్నారు.

సప్తముఖాల ప్రత్యేకతలివే...

ఏడు పడగల ఆదిశేషుడి నీడలో సప్తముఖాలతో ఖైరతాబాద్ మహాగణపతి కనిపిస్తారు. కుడివైపు ముఖాల్లో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు, ఎడమవైపు ముఖాల్లో సరస్వతి, లక్ష్మి, పార్వతి అమ్మవార్లు ఉంటారు. అలాగే రెండు వైపులా సప్తహస్తాలతో విభిన్నమైన ఆయుధాలను ధరించి స్వామి వారు దర్శనమిస్తారు. కుడివైపు చక్రం, పాశం, త్రిశూలం, పద్మం, శంఖం, అభయహస్తం, ఎడమవైపు రుద్రాక్షమాల, పాశం, గ్రంథం, వీణ, కమలం, గద, మరో చేతిలో (మోదక హస్తం) ప్రసాదాన్ని పట్టుకొని ఉంటారు. స్వామి వారి కుడివైపు అయోధ్య బాలరాముడు, ఎడమవైపు రాహు, కేతుల విగ్రహాలు, స్వామి వారి వాహనం మూషికం ఉంటాయి. వీటితో పాటు ఉప మండపాల్లో శ్రీ శ్రీనివాసుడు, లక్ష్మి కల్యాణంలో క్షీరసాగర మథనం, శ్రీ పార్వతీపరమేశ్వరుల కల్యాణంలో బ్రహ్మ, విష్ణు, నారద మహర్షిని వీక్షించవచ్చు.

70 అడుగుల ఎత్తు..

స్వామి వారి విగ్రహం 70 అడుగుల ఎత్తు, 28 అడుగుల వెడల్పుతో దర్శనమిస్తారు. వీటితో పాటు కుడివైపు పది అడుగుల అయోధ్య బాలరాముడి విగ్రహం, ఎడమ వైపు తొమ్మిది అడుగుల ఎత్తులో రాహు, కేతుల విగ్రహాలు, మూడు అడుగుల మూషికాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. కుడి వైపు 15 అడుగుల మండపంలో తొమ్మిది అడుగుల ఎత్తులో లక్ష్మి, శ్రీనివాసుడి విగ్రహాలు, ఎడమవైపు మండపంలో అంతే ఎత్తులో పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు.

సప్త మాతృకల శక్తి స్వరూపుడై..

బ్రహ్మణి, చాముండా, మహేశ్వరి, కౌమారి, వారాహి, ఇంద్రాణి, వైష్ణవి సప్తమాతృకలు. పురాణేతిహాసాల ప్రకారం ఆ సప్తమాతృకలు ఉద్భవించడానికి శ్రీ మహా గణపతి మూల కారణంగా చెబుతారు. అంతేకాకుండా కాలమానంలో ఏడు రోజులు, ఈ సంవత్సరం వినాయక చవితి ఏడో శనివారం, ఏడో తేదీ (సెప్టెంబర్ 7)న ఉండటంతో పాటు ఏడు పగడలతో అదిశేషుడి నీడలో శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతిగా (ప్రధాన విగ్రహంతో కలిపి) ఏడు ముఖాలతో ప్రతిష్ఠిస్తుండటం ఒక ప్రత్యేకతగా చెప్పవచ్చు. ప్రజలు, ప్రపంచం సుభిక్షంగా ఉండాలని, పాలకులు మంచి పాలన అందించేందుకు సప్తమాతృకలు శక్తిని ప్రసాదించాలన్న సంకల్పంతో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. అలాగే స్వామి వారికి ఒక వైపు ఉండే రాహు, కేతులు విగ్రహాలను దర్శించుకుంటే సకల దోషాలు, అరిష్టాలు తొలగిపోతాయని, మరో వైపు బాలరాముడి విగ్రహం రామరాజ్యానికి ప్రతీకగా ఉంటుందని దివ్యజ్ఞాన సిద్ధాంతి గౌరీభట్ల విట్టల శర్మ తెలిపారు. అలాగే ప్రస్తుత తరుణంలో యువతీ యువకులకు వివాహం జరుగడం లేదని, దేశ వ్యాప్తంగా బ్రహ్మచారిణులు, బ్రహ్మచారుల సంఖ్య పెరిగిపోయిందని, తల్లిదండ్రులు బాధపడుతున్నారని, ఈ నేపథ్యంలో ఉప మండపాల్లోని శ్రీ శ్రీనివాసుడు, పార్వతీ పరమేశ్వరుల కల్యాణాలను దర్శించుకుంటే లోకకల్యాణంతో పాటు పెండ్లి కాని వారికి వివాహాలు జరుగుతాయన్నారు.

'వన మహోత్సవం'పై నీలినీడలు!

టెండర్లకు ముందుకు రాని కాంట్రాక్టర్లు

కొన్నిచోట్ల ఆరుసార్లు పిలిచినా.. నో రెస్పాన్స్

3వేల ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు ప్లాన్ .. నిర్దేశిత లక్ష్యంపై తీవ్ర ప్రభావం

సిటీబ్యూరో, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో పచ్చదనం పెంపు పనులపై నీలినీడలు కమ్ముకున్నాయి. గ్రీనరీ పనులంటేనే కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఈ ఏడాది హరితహారం స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం వన మహోత్సవం పేరిట పచ్చదనం పెంపునకు సంకల్పించింది. జీహెచ్ఎంసీ పరిధిలోని కూకట్‌పల్లి, ఎల్బీనగర్, చార్మినార్, ఖైరతాబాద్, శేరిలింగంపల్లి, సికింద్రాబాద్ జోన్లకు రూ.30.81 లక్షల నిర్దేశిత లక్ష్యాలను ఖరారు చేసి.. గత నెల 8న మంత్రుల చేతుల మీదుగా మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పార్కులు , రహదారుల వెంబడి..సెంట్రల్ మీడియన్, ప్రభుత్వ, కేంద్ర రంగ సంస్థల్లో విరివిగా మొక్కలు నాటాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే నిర్దేశిత టార్గెట్ కంటే ఎక్కువగా.. మొత్తం 50 లక్షల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యాన్ని ఖరారు చేసింది. ఇందులో భాగంగా అర్బన్ బయోడైవర్సిటీ విభాగం అధికారులు మొక్కలను నాటేందుకు ఒక్కో చోట రూ.5 నుంచి 10 లక్షలతో పనులను విభజించి టెండర్లను ఆహ్వానించారు. నగరవ్యాప్తంగా దాదాపుగా 3వేల చోట్ల పనులకు టెండర్లు పిలిచారు. అయితే ఈ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ఆసక